# త్రిశ్రగతి

“మాస్టారూ, మీకు రెండు వుత్తరాలు----” అన్న మాట విని చిదంబరం దిగ్భ్రమచెందాడు. చెయ్యి చాపి ఆ రెండు లేఖలూ యెలా అందుకోగలిగాడో యిప్పుడు ఆలోచిస్తే ఆశ్చర్యమే అనిపిస్తోంది. అవును, తనకి వుత్తరాలేమిటి ? ఈ సువిశాల ప్రపంచంలో తనకు వుత్తరాలు రాసే దౌర్భాగ్యుడెవడూ లేడు. ఈ ఆలోచనలో పడి వుత్తరాలు చదవాలనే అనిపించలేదు. ఉత్తరం చదువుతుంటే యేదో అలవాటు లేని పని చేస్తున్నట్లుంది. మొదటి వుత్తరం గట్టిగా చదువుకున్నాడు. అర్థం అయింది కాదు. తనది కాదేమోనని అనుమానం . అడ్రెసు చూచుకున్నాడు “ఆర్.చిదంబరం, 20, విశాలాక్షి స్ట్రీట్, గాంధీనగరం ...”లక్షణంగా తన అడ్రెసేను. రెండు వుత్తరాలూ యిదే అడ్రసు చూపటం వల్లనే పోస్టు మనిషి, యివి తనకంటూ కేటాయించి యివ్వటంజరిగింది. నిస్సందేహంగా అంతేనూ: ఉత్తరాలు తనవి కాదని దిగులొందాల్సిన అవసరం లేదు. ఈ ఉత్తరాలు చదవటానికి ఉద్దేశించ బడ్డ ‘ఆర్. చిదంబరం’ అన్న ఆసామి ముమ్మాటికి తనే!

ఉత్తరం ఒకసారి చదువుకుంటే అర్థంకాలేదు. ఎంతసేపూ ఉత్తరం తనది కాదు అన్న అనుమానం మనసుకు మరో ఆలోచన చొరకుండా చేస్తుంది. ఊహూ, అల్లాగనుకుని లాభం లేదు. ఉత్తరం తనదేననుకొని చదవాలి. చిదంబరం గొంతు సరి చేసుకున్నాడు. ఈ సారి ఉత్తరం తనదే అవాలని పట్టు----

“విజయనగరం -ఫిబ్రవరి పదోతేదీ- 1954. ఎవరున్నారు తనకు విజయనగరంనించీ వుత్తరం రాశేందుకు? ఉత్తరం తనది కాకపోవచ్చు. ఈ ఊళ్ళో ‘గాంధీనగర్, విశాలాక్షి స్ట్రీటొ లో ఉంటున్న చిదంబరం ఈ ప్రపంచంలో కల్లా ఈ జన్మకి తనొక్కడే అయినప్పుడు ఉత్తరం తనది కాకుండా పోయేందుకు యేమవకాశం ఉంటుంది.? అబ్బ! తను యిట్లా అడుగడుగునా మధనపడుతోంటే ఎట్లా?---- ఉత్తరం చదవాలిగాని...

“శ్రీ యుత ఆర్ – చిదంబరంగారికి వి.సర్వోత్తమ రావు అనే పూర్వ మిత్రుడు గౌరవ పురస్కరంగా వందనాల అనంతరం వ్రాసే లేఖ. బహుశా ఈ సరికి మీరు నన్ను

10)



మర్చిపోయే వుందురు అనుకున్నాను. కాని తీరా ఈ మాసం 'కల్పన' సాహిత్య పత్రిక లో మీ పెద్దకథ చదివిం తర్వాత మీకు జ్ఞాపకం ఉండి వుండనని భయపడనవసరం లేదని ఈ లేఖ వ్రాయ బూనుకున్నాను. అన్నట్టు మీరన్నాళ్ళూ ఒక్కనాడేనా నాతో చెప్పారు కారే, కథలు రాయటంలో మీకు అమూల్య కౌశలం వున్నట్టు. రచయిత లందరికీ వున్న దురలవాటే. అది పోనీండి, నా అదృష్టంవల్ల ఈ నాటికైనా మీది అనే ఒక కథ----అందునా సువిశాలమైన పెద్ద కథ చదవగలిగాను. నా జన్మ పవిత్రమై పోయినట్లు భావిస్తున్నాను. అయినా నాకు ఆశ్చర్యం కలిగించే విషయం యేమిటంటే---- ఈ వూళ్ళో వుంటున్న 'కుముదిని' జీవిత చరిత్ర, పుట్టు పూర్వోత్తరాలు మాకే చాలమందికి తెలీవు కదా మీ రెట్లా తెలుసు కోగలిగారా అని! ఒకవేళ మీరు ఆ కథ కేవలం ఆలోచన మీదుగానే వ్రాశారంటే, ఒకానొక వ్యక్తి తాలూకు జీవితం యధాతథంగా చిత్రించింది కాదంటే---- కథల్లోని వ్యక్తుల్లాంటి వాళ్ళే బాహ్య ప్రపంచంలోకూడా వున్నందుకయినా నేను ఆశ్చర్యపడాల్సి వుంటుంది. ఏమయినా మీ రచనా నైపుణ్యాన్ని పొగిడే నిమిత్తమే నే నీ లేఖ వ్రాస్తున్నాను. కుముదినికీ నాకూ గడిచిన రహస్యగాథ మీతో యేనాడూ చెప్పినట్లు గుర్తు లేదు. ఒకవేళ నేనొక్కడి నీ చెప్పినా ఇతరవివరాలూ, కుముదిని గురించిన నాకు తెలియని విషయాలు మీరు వ్రాసినవి----మీకు యెట్లా సమకూడినవో నాకు అమిత ఆశ్చర్యంగా వుంది. చివరికో నిర్ణయానికి వచ్చాను. కొంపదీసి కుముదిని మీకు బంధువో లేక అప్తమిత్ర వర్గానికి చెందిందో కాదుగద! దయచేసి నా అనుమానాన్ని నివృత్తి చేస్తారని ఆశిస్తాను. అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూండండి. సెలవు - సర్వదా భవదీయుడు.-వి. సర్వోత్తమరావు."

ఎవరీ సర్వోత్తమరావు? 'కల్పన' యేమిటి? 'కల్పన'లో పెద్దకథ అంటాడే ఏమిటి? కుముదిని ఎవరు? తను పెద్ద కథ రాశినట్టు ఆరోపిస్తాడేమిటి? కనీసం కథలు చదువుదామన్న దురుద్దేశం కూడా తనకు లేదు గద! లేకపోగా----యీ విజయనగర పురవాసి - సర్వోత్తమరావు నామధేయుడు - త నకి మిత్రుడెలా అయినాడూ? తను కుముదిని కథ 'కల్పన' అనే పత్రికారాజంలో ఎలా రాస్తాడూ? విషయం యేమీ అందటం లేదు ఊహాకు. ఈ లేఖవెనక యేదైనా డిటెక్టివ్ వ్యవహారం లేదుగద. తనకసలే దొంగలన్నా, హంతకులన్నా భయం కూడానూ!

ఆలోచిస్తే మటుకు యేం తోస్తుంది? తనకు విజయనగరం దేశానికి యే మూలనో, తెలీదు. ఆ వూళ్ళో తనకు సర్వోత్తమరావుగాని, కుముదిని గాని ఎవరు మిత్రులు లేరు. అసలిలాంటి పేర్లు తనెప్పుడూ చరిత్రలో యెరిగిన పాపాన పోలేదు. కథలు రాయడం

తనకు సుతరామూరాదు. 'కల్పన' అనే పత్రిక ముఖం తనింతవరకు ఎన్నడూ చూచి వుండలేదు. ఇక యీ వుత్తరాన్ని గురించి ఆలోచించటానికి ఆస్కారం యెక్కడుంది? ఆలోచించటంలో అర్థంమాత్రం యెందుకుంటుంది?

పోనీ తరవాత చూదాం---- ఈ రెండో వుత్తరం యేమిటో చూదామని చించాడు. అది మద్రాసు నగరం నించి వచ్చింది. 'కల్పన' పత్రిక లెటర్‌హెడ్ కాయితం! యేవిటీ ఆశ్చర్యం, యీ రోజున? ఏ మంటాడు ఈ పక్షిరాజు? 'మహాశయా! తాము పంపిన పెద్ద కథ యీనెల మా పత్రికలో ప్రచురించి నామని తెలుపటానికి సంతోషిస్తున్నాము. ఇదే రకంగా ప్రసిద్ధ రచనలు చేసి మమ్ము ఆదరిస్తారని ఆశిస్తాము....'' ఏడవలేక పోయాడు---- అనుకున్నాడు కాని...! తనేమన్నా గారడీ చూస్తున్నాడా? ఇంద్రజాల మహేంద్రజాలాలు దర్శిస్తున్నాడా? లేక యేమిటీ విపరీతమంతానూ? ఈ రెండూ వుత్తరాలూ ఒకదాన్ని మరోటి సమర్థిస్తున్నాయి. దేన్ని గురించి ఆలోచించి ప్రయోజనం లేదు. ఎవరి మెదడో వక్రించి వుండాలి. కీళ్ళు సడిలి వుండాలి. ఎవరో యేదో దురద్దేశంతో యీ నాటకం ఆడుతూ వుండాలి. ఆర్. చిదంబరం తనే అయినా, కథలు రాసే ఆర్. చిదంబరం తను కాడు. 20, విశాలాక్షి స్ట్రీట్ లో వుంటున్న ఆర్. చిదంబరం తనే అయినా, ఆ స్ట్రీట్‌లో కథలు రాశే ఆర్. చిదంబరం తనుకాడు. అసలలాంటి వ్యక్తి ఈ ప్రపంచంలో ఉన్నాడో లేడో తెలీదు.

మరి... మరి యీ రెండు ఉత్తరాలు ఎవరు చదవడంకోసం రాయబడ్డాయి? వీటి తాలూకు కృతికర్తా, కృతి భర్తా యెవరు?

'కల్పన' అనే పత్రికలో ఆర్. చిదంబరం అనే ఒక పెద్ద ఆసామీ ఒక పెద్ద కథ రాశాడన్నది రూఢి! సదరు వ్యక్తి తన అడ్రెస్ లోనే ఉన్నాడు కూడానూ! కాని----తను కాదు---- తనక తనకు తోచేదల్లా యేమంటే---- ఎవరో యీ కథ రాసి తనపేరూ, విలాసమూ ఉపయోగించుకుసుంటారు. ఇంత విచిత్రం చేసేవాళ్ళు ఎవరబ్బా! అయినా అందరూ మెచ్చుకునేపాటి కళాఖండాన్ని రాశినవాడు దాన్ని మరెవరి పేరో బనాయింపు చేయటం యేమిటి? దీనికంతా యేదో పురాతన చరిత్ర వుండి వుండాలి అనిపిస్తుంది.

ఆర్. చిదంబరం ఈ ప్రశ్నలకు జవాబులు దొరుకుతవేమోనని చాలాసేపు ఆలోచించాడు: ఆలోచించటం కేవలం నిష్ప్రయోజనమని తెలిసే ఆలోచించాడు. ఇంతకూ యీ సంశయం తీర్చగల తాహతున్న వ్యక్తి యెవరో తెలియదు. ❋

(ఆంధ్రప్రభ--సచిత్ర వారపత్రిక)